## స్వయం ఉపాధితో ఆర్థిక ప్రయోజనం పొందాలి

**– కలెక్టర్ జితేశ్ వి పాటిల్**



కొర్రమీను చేపల పెంపకం యూనిట్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్

అశ్వాపురం, జూన్ 6 : స్వయం ఉపాధి పథకాల ద్వారా యువత ఆర్థిక ప్రయోజనాలు పొందాలని కలెక్టర్ జితేశ్ వి పాటిల్ అన్నారు. శుక్రవారం మిట్టగూడెం పంచాయతీలో సెర్ప్ ద్వారా కొర్సా దుర్గారావు దంపతులకు మంజూరైన కొర్రమీను చేపల పెంపక యూనిట్‌ను ఉపాధి హామీ ద్వారా అదే రైతుకు తవ్వించిన పారం పాండును పరిశీలించి బాగున్నాయని అభినందించారు. పనులను చెప్పిన విధంగా సకాలంలో పూర్తిచేస్తున్న ఎంపీడీవో ముత్యాలరావు, ఏపీవో సీతారామయ్యలను అభినందించారు. అనంతరం బైక్‌పై వెళ్లి మిట్టగూడెంలో డంపింగ్‌షెడ్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో ఏపీఎం సత్యనారాయణ, టెక్నికల్ అసిస్టెంట్ వెంకటేష్, పంచాయతీ కార్యదర్శి సైదులు, ఫీల్డ్ అసిస్టెంట్ రమేష్, సెర్ప్ సీసీ శోభారాణి పాల్గొన్నారు.

## హైకోర్టు జడ్జికి ఘనస్వాగతం

బూర్గంపహాడ్/ కొత్తగూడెం టౌన్, జూన్ 6 : హైకోర్టు జడ్జి నగేష్ శుక్రవారం బూర్గంపహాడ్ మండల పరిధిలోని సారపాక ఐటీసీ గెస్ట్‌హౌస్‌కు చేరుకున్నారు. కలెక్టర్ జితేశ్ వి పాటిల్ ఆయన్ని మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్కను అందించి స్వాగతం పలికారు. అనంతరం జిల్లాలో నెలకొన్న పరిస్థితులను కలెక్టర్ ఆయనకు వివరించారు.

## వైద్యసిబ్బంది సమన్వయంతో పనిచేయాలి

**– భద్రాచలం ఐటీడీఏ పీవో రాహుల్**



కొయ్యూరు పీహెచ్‌సీని సందర్శించిన ఐటీడీఏ పీవో రాహుల్

చర్ల, జూన్ 6 : పీహెచ్‌సీలో పనిచేసే సిబ్బంది సమన్వయంతో పని చేయాలని భద్రాచలం ఐటీడీఏ పీవో రాహుల్ అన్నారు. శుక్రవారం ఆశ కార్యకర్తల డే సందర్భంగా మండలంలోని కొయ్యూరు(చర్ల) ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన సందర్శించారు. పీహెచ్‌సీలోని సిబ్బంది ఆశ కార్యకర్తలతో ఏర్పాటుచేసిన ప్రత్యేక సమావేశంలో మాట్లాడారు. గర్భిణులు ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లకుండా ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే సాధారణ ప్రసవాలు జరిగేలా సిబ్బంది శ్రద్ధ తీసుకోవాలన్నారు. సమావేశానంతరం రికార్డులు తనిఖీ చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ చైతన్య, వైద్యులు శ్రీధర్, హారిక, స్పందన, సచిన్, సూపర్‌వైజర్లు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

## ఉపాధి కోర్సులకు శిక్షణ

భద్రాచలం, జూన్ 6 : ఐటీడీఏ భద్రాచలం ఆధ్వర్యంలో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో గిరిజన నిరుద్యోగ యువతీ, యువకులకు సోలార్ ప్యానల్ టెక్నీషియన్, ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీ, హెవీ మోటార్ వెహికల్ డ్రైవింగ్ ఉపాధి, స్వయం ఉపాధి కోర్సులకు నెల నుంచి రెండునెలల పాటు ఉచిత శిక్షణ కల్పించడానికి దరఖాస్తులు కోరుతున్నట్లు ఐటీడీఏ పీవో రాహుల్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 13వ తేదీ ఉదయం 9గంటలకు ఐటీడీఏ భద్రాచలం ప్రాంగణంలో యూత్ ట్రైనింగ్ సెంటర్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. త్యాగాలకు ప్రతీకగా నిలిచే బక్రీద్ పండుగను ముస్లింలు భక్తిశ్రద్ధలతో ఉత్సాహంగా జరుపుకోవాలని ఐటీడీఏ పీవో రాహుల్ మరో ప్రకటనలో కోరారు.

## రైతుల సమస్యలు పరిష్కరించాలి

దుమ్ముగూడెం, జూన్ 6 : మండల పరిధిలోని లచ్చిగూడెం గ్రామంలో భూభారతి సదస్సు శుక్రవారం నిర్వహించారు. ఈ సదస్సులో గ్రామానికి చెందిన రైతులు తమ భూ సమస్యలు పరిష్కరించాలని రెవెన్యూ అధికారులకు వినతిపత్రం అందజేశారు. అయితే రెవెన్యూ అధికారులు వినతిరూపంలో కాకుండా రైతులందరూ తమ భూ సమస్యలకు సంబంధించి లిఖితపూర్వకంగా దరఖాస్తులు చేసుకోవాలని సూచించడంతో కొద్దిసేపు రైతులు, అధికారుల మధ్య వాగ్వాదం జరిగింది. చేసేది ఏమీలేక రైతులు లిఖితపూర్వక దరఖాస్తులను అధికారులకు అందించారు. కార్యక్రమంలో పెనుబల్లి రాజేష్, యడమయ్య, భద్రయ్య, బాబూరావు, ముత్తయ్య, లక్ష్మయ్య, జోగయ్య పాల్గొన్నారు.




మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్ Classifieds

**CHANGE OF NAME**

* I, **MOHD SHAKEELA BEGUM** (OLD NAME), D/O. MOHD AZEEZ KHAN, R/O. H.No. 14-1-95, SBH ROAD, PALWANCHA, BHADRADRI KOTHAGUDEM DIST, TELANGANA - 507115, CHANGED MY NAME AS **MOHAMMED SHAKEELA BANU** (NEW NAME), D/O. MOHAMMED AZEEZ KHAN.
KMM -

**CHANGE OF NAME**

* I, **SHAIK MASOOR ALI** (OLD NAME), R/O. H.No. 20-8-83, NEW COLONY, KHAMMAM URBAN, NEAR SALON SHOP, DHAMSALAPURAM, KHAMMAM DIST, TELANGANA - 507003. CHANGED MY NAME AS **SHAIK MANSOOR ALI** (NEW NAME), S/O. SHAIK LATHIF SAHEB
KMM -

అతి తక్కువ ఖర్చు
అత్యధిక ప్రచారం

**గమనిక**
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073

నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616

## ప్రభుత్వ పాఠశాలల్లోనే..

# నాణ్యమైన విద్య

### భద్రాద్రి జిల్లా వ్యాప్తంగా 'బడిబాట' కార్యక్రమం

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య లభిస్తుందని విద్యాశాఖ జిల్లా చీఫ్ మానిటరింగ్ ఆఫీసర్ సైదులు పేర్కొన్నారు. అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో నాణ్యమైన బోధన అందుతుందని అన్నారు. అందుకని తల్లిదండ్రులందరూ ప్రభుత్వ బడుల్లో తమ పిల్లలను చేర్పించి బడుల బలోపేతానికి కృషిచేయాలని సూచించారు. భద్రాద్రి జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లోనూ విద్యాశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. జూలూరుపాడు జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో సైదులు మాట్లాడారు. సర్కారు ఉచిత పాఠ్యపుస్తకాలు, రెండు జతల దుస్తులు, నోట్ పుస్తకాలు, మధ్యాహ్న భోజనం వంటి సౌకర్యాలను ప్రభుత్వం కల్పిస్తోందని వివరించారు. విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు పునాదులు వేసేందుకు వారిని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని సూచించారు. అధికారులు, ఉపాధ్యాయులు ఇంటింటికీ వెళ్లి పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని సూచిస్తూ అవగాహన కల్పించారు. పలు గ్రామాల్లో ర్యాలీలు కూడా నిర్వహించారు. –నమస్తే నెట్‌వర్క్, జూన్ 6



జూలూరుపాడులో మాట్లాడుతున్న సైదులు



అన్నపురెడ్డిపల్లి : ఎర్రగుంట పాఠశాలలో..



మణుగూరు టౌన్‌లో..

## ఐడెల్ ఎక్స్‌ప్లోజివ్ లిమిటెడ్ కంపెనీలో డీఎస్పీ తనిఖీ



తనిఖీ చేసి మాట్లాడుతున్న డీఎస్పీ రెహమాన్

కొత్తగూడెం టౌన్, జూన్ 6: వార్షిక తనిఖీల్లో భాగంగా సుజాతనగర్ మండలంలోని డేగలమడుగు శివారులో ఉన్న ఐడెల్ ఎక్స్‌ప్లోజివ్ లిమిటెడ్ కంపెనీని కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్ శుక్రవారం తనిఖీ చేశారు. ఇందులో భాగంగా కంపెనీ లైసెన్సు, ఎన్‌వోసీ, ఇతర పర్మిషన్, సర్టిఫికెట్లను పరిశీలించారు. అక్కడ పనిచేస్తున్న సిబ్బంది వివరాలు తెలుసుకున్నారు. కంపెనీలో పాటించాల్సిన రక్షణ సూత్రాలను తెలియపర్చారు. చుంచుపల్లి సీఐ రాయల వెంకటేశ్వర్లు, సుజాతనగర్ ఎస్సై ఎం.రమాదేవి, ఏఎస్సై విజయసింహారెడ్డి, ఉమ పాల్గొన్నారు.

## దేశానికి అత్యంత కీలకంగా అశ్వాపురం భారజల కర్మాగారం

**– హెవీ వాటర్ బోర్డు చైర్మన్, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సత్యకుమార్**

భద్రాచలం, జూన్ 6 : దేశానికి మణుగూరు భారజల కర్మాగారం అత్యంత కీలకమైందని హెవీ వాటర్ బోర్డు చైర్మన్, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సత్యకుమార్ వెల్లడించారు. శుక్రవారం భద్రాచలంలో శ్రీ సీతారామచంద్రస్వామి వారిని ఆయన అశ్వాపురం ప్లాంట్ జీఎం శ్రీనివాస్‌తో కలిసి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. అనంతరం విలేకరులతో ఆయన మాట్లాడుతూ అమృత్ కాల్ 2047లో భాగంగా దేశంలోని నాలుగు కీలకమైన మణుగూరు, కోటా, అజీరా, తాల్ హెవీ వాటర్ ప్లాంట్ల సామర్థ్యంను మరింతగా పెంచుతున్నామని తెలిపారు. 2047 నాటికి వంద గెగావాట్‌ల న్యూక్లియర్ విద్యుత్ ఉత్పత్తి లక్ష్యంగా పనిచేసేందుకు అవసరమైన భారజలంను తయారుచేసి అందించేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టామని అన్నారు.

## ఏడుగురు మావోయిస్టుల లొంగుబాటు

**వివరాలు వెల్లడించిన ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం దంతేవాడ జిల్లా పోలీసులు**

కొత్తగూడెం ప్రగతి మైదాన్, జూన్ 6 : ఇద్దరు క్యాడర్ ఉన్న మావోయిస్టులతో సహా ఏడుగురు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం దంతేవాడ జిల్లా పోలీసు అధికారుల ఎదుట లొంగిపోయారు. ఇందుకు సంబంధించిన వివరాలను దంతేవాడ జిల్లా పోలీస్ అధికారులు విలేకరుల సమావేశంలో శుక్రవారం వెల్లడించారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర పోలీసులు నిర్వహిస్తున్న 'లోన్ వర్రాటు' కార్యక్రమానికి ఆకర్షితులైన ఇద్దరు క్యాడర్ ఉన్న మావోయిస్టులతో పాటు మరో ఐదుగురు సభ్యులు లొంగిపోయినట్లు వెల్లడించారు. వీరంతా గతంలో అనేక విధ్వంసకర ఘటనల్లో పాలుపంచుకున్నారని, జిల్లాలోని పలు పోలీస్‌స్టేషన్లలో వీరిపై పలు కేసులు నమోదైనట్లు ధ్రువీకరించారు. ఇదిలా ఉండగా.. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా బైరామ్‌గఢ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని 63 హైవేలో మహారాష్ట్ర వైపు వెళ్తున్న ఓ ట్రక్కుకు గురువారం అర్ధరాత్రి మావోయిస్టులు నిప్పంటించారు. ఈ ఘటనపై బైరామ్‌గఢ్ పోలీసులు కేసు నమోదు చేసి, ఆ ప్రాంతంలో సెర్చింగ్ ఆపరేషన్ ముమ్మరం చేశారు.

## ఆక్రమణల తొలిగింపు

అశ్వారావుపేట టౌన్, జూన్ 6 : పట్టణంలో రోడ్డు విస్తరణలో భాగంగా ఆక్రమణలను పోలీసుల, అటవీ అధికారులు శుక్రవారం తొలిగించారు. పోలీస్‌స్టేషన్ సమీపంలో అటవీ చెక్‌పోస్ట్ పరిధిలో దుకాణాలను రేంజర్ మురళీ, సీఐ నాగరాజు ఆధ్వర్యంలో సిబ్బంది ఖాళీ చేయించారు. రెండు దుకాణాలకు కోర్టు క్లియరెన్స్ ఉండటంతో ముందుగా వాటిని తొలిగించినట్లు రేంజర్ మురళీ తెలిపారు. మిగతా దుకాణాలు, ఇతర భవనాలపై కోర్టులో వివాదం ఉండటం వల్ల తాత్కాలికంగా నిలుపుదల చేసినట్లు పేర్కొన్నారు.

## సాగు ఖర్చు తగ్గించి అధిక లాభాలు పొందాలి

**– వ్యవసాయ కళాశాల శాస్త్రవేత్త స్రవంతి**

అశ్వారావుపేట రూరల్, జూన్ 6 : పంటల సాగు ఖర్చు తగ్గించుకుని అధిక లాభాలు పొందాలని స్థానిక వ్యవసాయ కళాశాల శాస్త్రవేత్తలు డి.స్రవంతి, డాక్టర్ పీ శ్రీలత రైతులకు సూచించారు. ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలోని కేశప్పగూడెం పంచాయతీ కార్యాలయం వద్ద 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యూరియా అధిక మోతాదులో వాడకూడదని దానివలన సాగు ఖర్చులు పెరగటమే కాకుండా భూమిలో ఉన్న సూక్ష్మజీవులు సంఖ్య కూడా తగ్గిపోతుందన్నారు. అవసరం మేరకు రసాయాలను వినియోగించి నేలతల్లి ఆరోగ్యాన్ని కాపాడాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి శివరాంప్రసాద్, ఏఈవోలు సతీష్, షాకీరాభాను, పంచాయతీ కార్యదర్శి సమ్మయ్య, ఉపాధ్యాయులు రాము, రైతులు పాల్గొన్నారు.

## ఇల్లెందు సబ్‌జైలు తనిఖీ

ఇల్లెందు, జూన్ 6 : ఇల్లెందు సబ్‌జైలును జిల్లా న్యాయ సేవా సంస్థ కార్యదర్శి రాజేందర్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. జైలు రికార్డులను తనిఖీ చేసి, ఖైదీలకు కల్పిస్తున్న వసతులను పరిశీలించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అనంతరం ఖైదీలతో మాట్లాడుతూ ఆర్థిక స్తోమత లేనివారికి న్యాయ సంస్థ తరపున ఉచిత న్యాయవాదిని అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఇల్లెందు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కాంపెల్లి ఉమామహేశ్వరరావు, జైలు సూపరింటెండెంట్ ఎన్.చంద్రశేఖర్‌రావు, భూజంగరాజు, శ్రీనివాసు, దూలియా పాల్గొన్నారు.

## మంచినీటి సమస్య తలెత్తకుండా చర్యలు: సివిల్ జీఎం

కొత్తగూడెం సింగరేణి, జూన్ 6: సింగరేణి సంస్థ వ్యాప్తంగా ఉన్న కార్మికులు, అధికారుల కాలనీల్లో మంచినీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని సివిల్ జీఎం వెంకటేశ్వర్లు అన్నారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన తర్వాత శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సంస్థ వ్యాప్తంగా అధికారులు, ఉద్యోగులు నివసించే కాలనీల్లో అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని అన్నారు. బొగ్గు ఉత్పత్తికి అనుబంధంగా ఉన్న నిర్మాణాల్లో జాప్యం జరగకుండా సమయానికి నిర్మాణాలు పూర్తి చేయించేలా చర్యలు తీసుకుంటామన్నారు.

## బొగ్గు నాణ్యత పెంపుదలకు నేటి నుంచే కార్యాచరణ

కొత్తగూడెం సింగరేణి, జూన్ 6: సింగరేణి సంస్థ ఉత్పత్తి చేస్తున్న బొగ్గులో జీ15 గ్రేడ్ బొగ్గును థర్మల్ విద్యుత్ కేంద్రాలు స్వీకరించడానికి ఆసక్తి చూపడం లేదు కాబట్టి అన్ని ఏరియాల్లో జీ13 గ్రేడ్ బొగ్గును సంసిద్ధం చేసి రవాణా చేయాలని డైరెక్టర్లు ఆదేశించారు. శనివారం నుంచి దీనిని కార్యాచరణలో పెట్టాలని స్పష్టం చేశారు. బొగ్గు నాణ్యత పెంపుదలపై అన్ని ఏరియాల జీఎంలు, క్వాలిటీ విభాగం జీఎంలు, ఇతర అధికారులతో డైరెక్టర్లు సూర్యనారాయణ, వెంకటేశ్వర్లు, సుభానీలు శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. తక్కువ గ్రేడ్ ఉన్న బొగ్గును స్వీకరించడానికి వినియోగదారులు ముందుకు రాకపోవడం వల్ల కంపెనీకి అపార నష్టం జరిగే ప్రమాదం ఉందని, దీనిని నివారించడం కోసం జీ13 గ్రేడ్ వచ్చే విధంగా ఏరియాల్లో తక్షణమే తగు చర్యలు చేపట్టాలని ఈ సందర్భంగా ఆదేశించారు.

## గాయపడిన మూషిక జింకను కాపాడిన అధికారులు

లక్ష్మీదేవిపల్లి, జూన్ 6: సుజాతనగర్ మండలం లక్ష్మీదేవిపల్లి తండా పంచాయతీలోని ఓ రైతు పొలంలో ముంగీస దాడిలో గాయపడిన మూషిక జింకను అటవీ అధికారులు కాపాడారు. తొలుత గాయపడి తన పొలంలో ఉన్న మూషిక జింకను సదరు రైతు బానోత్ భాస్కర్ గమనించాడు. వెంటనే అటవీ అధికారులకు సమాచారం అందించి కొత్తగూడెం ఫారెస్టు రేంజ్ ఆఫీస్‌కు తీసుకెళ్లాడు. రేంజ్ ఆఫీసర్ శ్రీనివాసరావు, ఎస్ఎఫ్‌వో వెంకటేశ్వర్లు, సిబ్బంది కలిసి ఫారెస్టు డివిజనల్ అధికారి కోటేశ్వరరావు ఆదేశాల మేరకు గాయపడిన మూషిక జింకకు రామవరంలోని పశువైద్యశాలలో చికిత్స చేయించారు. అనంతరం యానంబైలులో అప్పగించారు.

## మద్యం తాగి వాహనాలు నడిపిన 26 మందికి జరిమానా

కొత్తగూడెం టౌన్, జూన్ 6: అతిగా మద్యం తాగి వాహనాలు నడిపిన కేసులో 26 మందికి కొత్తగూడెం కోర్టులో స్పెషల్ జ్యుడీషియల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ మెండు రాజమల్లు జరిమానా విధిస్తూ శుక్రవారం తీర్పు చెప్పారు. వన్‌టౌన్ ఎస్సై రాకేశ్ వాహనాలు తనిఖీ చేస్తుండగా ఒకరిని, ట్రాఫిక్ ఎస్సై నరేశ్ తన సిబ్బందితో కలిసి వాహనాలు తనిఖీ చేస్తుండగా 9 మందిని, పాల్వంచ పట్టణ ఎస్సై సుమన్ వాహనాలు తనిఖీ చేస్తుండగా ఒకరిని, కొత్తగూడెం టూటౌన్ ఎస్‌హెచ్‌వో రమేష్‌కుమార్, ఎస్సైలు ఆలీఖాన్, కిశోర్‌లు వాహనాలు తనిఖీ చేస్తుండగా 15 మందిని ఆపి బ్రీత్ ఎనలైజర్ల ద్వారా పరీక్షించారు. వారు మద్యం తాగినట్లు రుజువు కావడంతో వారిని కోర్టులో ప్రవేశపెట్టారు. జడ్జి వారికి జరిమానాలు విధించారు.

## 'ఆపరేషన్ కగార్ పేరిట హత్యాకాండను ఆపాలి'

కొత్తగూడెం అర్బన్, జూన్ 6: ఆపరేషన్ కగార్ పేరిట కొనసాగిస్తున్న హత్యాకాండను వెంటనే ఆపాలని సీపీఎం నాయకుడు మచ్చా వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. మోడీ ప్రభుత్వం వెంటనే కాల్పుల విరమణ ప్రకటించి మావోయిస్టు పార్టీతో బేషరతుగా శాంతి చర్చలు జరపాలని కోరారు. ఈ మేరకు అన్ని రాజకీయ పార్టీల ఆధ్వర్యంలో కొత్తగూడెంలోని ఇప్టూ కార్యాలయంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మచ్చా వెంకటేశ్వర్లుతోపాటు వివిధ పార్టీల నేతలు, సంఘాల నాయకులు గౌని నాగేశ్వరరావు, జాటోత్ కృష్ణ, రామనాథం మాట్లాడారు. ఈ నెల 14న జరిగే చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. నాయకులు నందిపాటి రమేశ్, వై.గోపాలరావు, రాజశేఖర్, ప్రణయ్‌కుమార్, బంక వెంకటేశ్వర్లు, బి.శివ పాల్గొన్నారు.

## విత్తన అమ్మకాల్లో నిబంధనలు పాటించాలి

ఇల్లెందు, జూన్ 6 : విత్తన అమ్మకాల్లో నిబంధనలు పాటించకుంటే కఠికచర్యలు తప్పవని జిల్లా వ్యవసాయశాఖ అధికారి వేల్పుల బాబూరావు హెచ్చరించారు. శుక్రవారం ఇల్లెందు పట్టణంలో పలు విత్తనాల షాపులను ఏవో సతీష్‌తో కలిసి తనిఖీ చేశారు. కార్యక్రమంలో జిల్లా టెక్నికల్ ఏవో సాయినారాయణ పాల్గొన్నారు.

## ఎఫ్‌బీవో కుటుంబానికి సహచరుల ఆర్థిక సాయం

లక్ష్మీదేవిపల్లి, జూన్ 6: ఓ ఎఫ్‌బీవో రోడ్డు ప్రమాదంలో మృతిచెందగా.. సహచరులు ఆర్థిక సాయం అందించి అతడి కుటుంబాన్ని ఆదుకున్నారు. డీఏఫ్‌వో డీఎఫ్‌వో ఆంగోత్ సాంబశివరావు ఓ రోడు ప్రమాదంలో అకాల మరణం పొందారు. ఈ క్రమంలో తోటి ఉద్యోగులంతా కలిసి తమవంతుగా రూ.1,10,200 నగదును జమ చేశారు. ఆ మొత్తాన్ని జిల్లా అటవీ అధికారి కిష్టాగౌడ్ ద్వారా శుక్రవారం సాంబశివరావు కుటుంబ సభ్యులకు అందించారు.

## ఉత్తమ ప్రతిభ కనపర్చిన విద్యార్థులకు సన్మానం

పాల్వంచ, జూన్ 6: మున్సిపాలిటీ పరిధిలోని శేఖరం బంజర గ్రామానికి చెందిన విద్యార్థులు ఇంటర్, బీటెక్‌లలో ఉత్తమ ప్రతిభ కనపర్చారు. ఈ సందర్భంగా సదరు విద్యార్థులను, వారి తల్లిదండ్రులను గ్రామస్తులు శుక్రవారం సత్కరించారు. గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాల ప్రాంగణంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఇంటర్, బీటెక్‌లలో ఉత్తమ ప్రతిభ కనపర్చిన శైలజ, అక్షయ, ఉషశ్రీ, పవిత్ర, స్వప్న, పావని, ప్రీతిక, శివాని అనే విద్యార్థినులతో పాటు వారి తల్లిదండ్రులను సన్మానించారు. పాత పాల్వంచ కాంప్లెక్స్ హెచ్ఎం పద్మలత, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## ఎన్‌సీసీ విద్యార్థులకు సర్టిఫికెట్ల ప్రదానం

లక్ష్మీదేవిపల్లి, జూన్ 6: కొత్తగూడెంలోని శ్రీరామచంద్ర డిగ్రీ కాలేజీ, సింగరేణి మహిళా డిగ్రీ కాలేజీల్లోని ఎన్‌సీసీ విద్యార్థులకు తెలంగాణ 11వ బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ భద్ర శుక్రవారం సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ఈ రెండు కాలేజీలకు చెందిన దాదాపు 55 మంది ఎన్‌సీసీ విద్యార్థులు ఎన్‌సీసీ అకడమిక్ ఇయర్‌ను పూర్తి చేసుకొని వంద శాతం ఉత్తీర్ణత సాధించారు. ఈ సందర్భంగా ఖమ్మంలోని తెలంగాణ 11వ బెటాలియన్ ఎన్‌సీసీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో కల్నల్ భద్ర సదరు విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పద్మ, డాక్టర్ శారద, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పూర్ణచందర్‌రావు, ఎన్‌సీసీ ఆఫీసర్ లెఫ్టినెంట్ శ్రీలత, డాక్టర్ మధు తదితరులు పాల్గొన్నారు.

## పొడిదుక్కుల్లో విత్తనాలు వేయవద్దు

**– ఏడీఏ శోభన్‌బాబు**

టేకులపల్లి, జూన్ 6 : రైతులు తొందరపడి పొడి దుక్కుల్లో విత్తనాలు వేయవద్దని జిల్లా వ్యవసాయ శాఖ ఏడీఏ శోభన్‌బాబు అన్నారు. శుక్రవారం టేకులపల్లి మండలం తొమ్మిదోమైలుతండా గ్రామంలో పొడి దుక్కులను స్థానిక వ్యవసాయశాఖ అధికారి అన్నపూర్ణతో కలిసి పరిశీలించిన టెక్నికల్ ఏడీఏ శోభన్‌బాబు రైతులతో మాట్లాడుతూ పొడి దుక్కుల్లో పత్తి విత్తనాలు వితకూడదని, 2 నుంచి 10 సెంటీమీటర్ల వర్షపాతం వచ్చినప్పుడు మాత్రమే రైతులు విత్తనాలు విత్తుకోవాలని సూచించారు. అనంతరం తొమ్మిదోమైలుతండా సీడ్స్ షాపుల్లో స్టాక్ రిజిస్టర్, ఇన్వాయిస్, పెర్మిషన్ కాపీ చెక్ చేశారు. పీఏసీఎస్ బేతంపూడిలో పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ విధానాన్ని పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఏవో అన్నపూర్ణ పాల్గొన్నారు.

## బీమా అమలులో దేశానికే ఆదర్శం

**రూ.కోటి ప్రమాద బీమా చెక్కు పంపిణీలో సీఎండీ బలరాం**




చెక్కు అందజేస్తున్న సింగరేణి అధికారులు

కొత్తగూడెం సింగరేణి, జూన్ 6 : ప్రమాద బీమా పథకం అమలులో సింగరేణి సంస్థ దేశానికే ఆదర్శంగా నిలిచిందని సింగరేణి సీఎండీ బలరాం పేర్కొన్నారు. శుక్రవారం కొత్తగూడెం హెడ్డాఫీస్ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో సీఎండీ తన సందేశం ఇచ్చారు. ఇటీవల ప్రమాదంలో మృతి చెందిన మణుగూరుకు చెందిన ఈపీ ఆపరేటర్ మూల్‌చంద్ విశ్వకర్మ ఎస్‌బీఐలో కార్పొరేట్ శాలరీ అకౌంట్ ఉందని, ఈ నేపథ్యంలో ఆయన కుటుంబానికి రూ.కోటి బీమా వర్తించగా.. ఆయన భార్య హరిదేవి విశ్వకర్మకు డైరెక్టర్లు సూర్యనారాయణ, వెంకటేశ్వర్లు, సత్యనారాయణల చేతుల మీదుగా కోటి రూపాయల చెక్కును అందించారు.

## ఐటీడీఏ ట్రైబల్ ఈఈగా హరీష్



ట్రైబల్ ఈఈగా బాధ్యతలు చేపడుతున్న హరీష్

భద్రాచలం, జూన్ 6 : భద్రాచలం ఐటీడీఏ పీవో రాహుల్ ఆదేశాల మేరకు ఐటీడీఏ ఇంజినీరింగ్ విభాగంలో ట్రైబల్ ఈఈగా హరీష్ అదనపు బాధ్యతలు స్వీకరించారు. శుక్రవారం ఈ మేరకు విధుల్లో చేరారు. భూపాలపల్లి ఏటూరు నాగారం ఐటీడీఏలో ఏఈఈగా పనిచేసి 2018లో పాల్వంచ డివిజన్‌కు వచ్చారు. పాల్వంచ నుంచి డీఈఈగా ఉద్యోగోన్నతిపై 2019లో అశ్వారావుపేటకు వచ్చారు. 2021 నుంచి ఐటీడీఏ డీఈగా విధులు నిర్వహిస్తూ తాజాగా ఐటీడీఏ ట్రైబల్ ఈఈగా బాధ్యతలు చేపట్టారు.

## లైటింగ్ బెల్టులు అందజేత

మణుగూరు టౌన్, జూన్ 6 : బీటీపీఎస్ నుంచి మణుగూరు వచ్చే మార్గమధ్యంలో రోడ్డు మీద గుర్తుతెలియని ఆవులు, గేదెలు ఉండటంతో రాత్రివేళ వాహనదారులు తరచుగా ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ ప్రమాదాల నివారణ కోసం బీటీపీఎస్ హెల్పింగ్ హ్యాండ్స్ ఆధ్వర్యంలో ఆవులు, గేదెల యజమానులకు లైటింగ్ బెల్టులను అందజేశారు. ఈ బెల్టులు ఉంటే రాత్రి సమయంలో జంతువులు స్పష్టంగా కనిపించడంతో ప్రమాదాలు జరగకుండా ఉంటాయని వారు తెలిపారు.

## పర్ణశాల ఆలయానికి రూ.7,35,728 ఆదాయం

పర్ణశాల, జూన్ 6 : పర్ణశాల ఆలయం హుండీ లెక్కింపు కార్యక్రమాన్ని భద్రాచలం ఆలయ ఈవో సమక్షంలో శుక్రవారం నిర్వహించారు. హుండీ ద్వారా రూ.7,37,728 ఆదాయం సమకూరింది. గత మే నెల 7వ తేదీన ఆలయ హుండీ లెక్కింపు నిర్వహించారు. అప్పటి నుంచి ఇప్పటివరకు నెలరోజుల వ్యవధిలో ఈ ఆదాయం వచ్చినట్లు అధికారులు వెల్లడించారు.

## పోలీసుల అదుపులో వృద్ధుడు

అశ్వారావుపేట, జూన్ 6 : దొంగ అనే అనుమానంతో ఒక వృద్ధుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని వినాయకపురం గ్రామంలో గురువారం రాత్రి అనుమానాస్పదంగా సంచరిస్తున్న వృద్ధుడిని దొంగగా అనుమానించి గ్రామస్తులు పట్టుకున్నారు. అతడు పొంతనలేని సమాధానాలు చెప్పడంతో విద్యుత్ స్తంభానికి కట్టేసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే స్పందించిన పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వృద్ధుడిని అదుపులోకి తీసుకుని విచారించారు. వృద్ధుడికి మతిస్థిమితం సరిగా లేదని, అందుకే వదిలేసినట్లు ఎస్సై రామ్మూర్తి తెలిపారు.

## గంజాయి పట్టివేత

అశ్వాపురం, జూన్ 6 : ఎస్సై మధుప్రసాద్ ఆధ్వర్యంలో పోలీసులు తనిఖీలు నిర్వహించి శుక్రవారం రూ.66.20 లక్షల విలువైన 132 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. చింతూరు నుంచి మహారాష్ట్ర నాందేడ్‌కు గంజాయి రవాణా చేస్తున్న వాహనంతోపాటు పల్లెపు పరశురాములు అనే వ్యక్తిని మండల పరిధిలోని గొల్లగూడెంలోని సీతారామ కెనాల్ సమీపంలో అదుపులోకి తీసుకున్నారు. అతడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. తనిఖీల్లో ఎస్సైతోపాటు సిబ్బంది పాల్గొన్నారు.

## లారీ ఢీకొని వ్యక్తి మృతి

పాల్వంచ రూరల్, జూన్ 6: లారీ ఢీకొన్న ప్రమాదంలో కేశవాపురానికి చెందిన కుంచాల సూర్యనారాయణ (48) మృతిచెందిన ఘటన మండలంలోని ఇందిరా కాలనీ పెట్రోలు బంకు సమీపంలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. సూర్యనారాయణ పెద్దమ్మతల్లి ఆలయంలో రికార్డ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు. ద్విచక్రవాహనంపై శుక్రవారం మధ్యాహ్నం పాల్వంచవైపు వస్తున్నాడు. అదే సమయంలో భద్రాచలం నుంచి పాల్వంచ వైపు వస్తున్న లారీ ఇందిరా కాలనీ పెట్రోలు బంకు వద్ద సూర్యనారాయణ ద్విచక్రవాహనాన్ని వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సూర్యనారాయణ తలకు, ఛాతికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు గుర్తించి వెంటనే పాల్వంచ ఏరియా ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. అతివేగంగా, నిర్లక్ష్యంగా లారీ నడిపి ప్రమాదానికి కారణమైన ఆంధ్రాలోని పశ్చిమగోదావరికి చెందిన డ్రైవర్ అనసూరి బాలకృష్ణపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## టైరు పేలి మెకానిక్‌కు తీవ్రగాయాలు

కరకగూడెం, జూన్ 6 : టైరు పేలి మెకానిక్‌కు తీవ్రగాయాలైన ఘటన కరకగూడెం మండలంలో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. గ్రామస్తులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన టప్పు సతీష్(45) బైక్ మెకానిక్‌గా పనిచేస్తూ గాలిమిషన్‌ను నడిపిస్తున్నాడు. ఈ క్రమంలో ట్రాక్టర్ టైరుకు గాలి ఎక్కిస్తుండగా పేలడంతో సతీష్ ఎడమ చేయి విరగడంతోపాటు తలకు తీవ్ర గాయమైంది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే 108 సహాయంతో మణుగూరులో ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు.

## ఇద్దరిపై కేసు నమోదు

బూర్గంపహాడ్, జూన్ 6 : ఇసుక ట్రాక్టర్లను అడ్డగించి బెదిరించి డబ్బులు డిమాండ్ చేసినందుకు ఇద్దరిపై బూర్గంపహాడ్ పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. ఎస్సై రాజేష్ తెలిపిన వివరాల ప్రకారం.. సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఇసుకను ప్రభుత్వ అధికారుల అనుమతితో కూపన్లు తీసుకుని సోంపల్లి నుంచి బూర్గంపహాడ్‌కు ట్రాక్టర్లతో తోలుతుండగా 3వ తేదీన బూర్గంపహాడ్‌కు చెందిన తోకల చెన్నారాయుడు అలియాస్ బబ్బు, తోకల శివలు విలేకరులమని చెప్పి డబ్బులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శెనగ కిషోర్, పోలకొండ సత్యప్రసాద్, కన్నెబోయిన సారథి, నిమ్మల హరీష్, మంద ప్రసాద్, కొమ్ము బాలు వారిపై ఫిర్యాదు చేశారు. ఎస్సై రాజేష్ ఆ ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

## ఎదురెదురుగా లారీలు ఢీ

అశ్వారావుపేట, జూన్ 6 : ఎదురెదురుగా వచ్చిన రెండు లారీలు అదుపు తప్పి ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో లారీడ్రైవర్ తీవ్రంగా గాయపడ్డాడు. మండలంలోని నారంవారిగూడెం సమీపంలోని పామాయిల్ ఫ్యాక్టరీ ఎదురుగా శుక్రవారం జరిగిన ఘటనా వివరాలు ఇలా ఉన్నాయి. హైదరాబాద్ నుంచి ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెంకు సరుకులతో వెళ్తున్న లారీ, రాజమండ్రి నుంచి సూర్యాపేట వెళ్తున్న మరో లారీ అదుపు తప్పి ఢీకొన్నాయి. లారీడ్రైవర్ సువర్ణకంటి నాగమల్లేశ్వరరావు తీవ్రంగా గాయపడ్డాడు. డ్రైవర్‌ను చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఒక లారీ జాతీయ రహదారిపై బోల్తా పడింది. దీంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. స్పందించిన పోలీసులు జేసీబీతో లారీని తొలిగించి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు.